సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 5 । ఆగస్టు । 2025



తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

తమిళనాడు రాష్ట్రం తిరుత్తణి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పీలేరు మాజీ సర్పంచ్ హుమయూన్, ఆయన సోదరుడు షాజహాన్ మృతి చెందారు - 8లో



సత్వర న్యాయం అందించండి

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోపు సత్వరం పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.380	రూ.500
రెండోరకం	రూ.200	రూ.370

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 219 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా లక్ష్మీదేవి



రాయచోటి జగదాంబ సెంటర్ : జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా పి.లక్ష్మీదేవి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ కడప జిల్లా మెప్మా కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ జిల్లాల బైఫరికేషన్‌లో భాగంగా అన్నమయ్య జిల్లాకు వచ్చారు. గతంలో లక్కిరెడ్డిపల్లె ఎంపీడీవోగా, రామాపురం మండలంలో కూడా పాలనలో సేవలు అందించారు. వైఎస్సార్ కడప జిల్లా చింతకొమ్మదిన్నె, మైదుకూరు మండలాల్లో ఎంపీడీఓగా సేవలందించారు.

బి.ఫారాలు అందజేత



బి.ఫారాలను అందజేస్తున్న కార్పొరేటర్ మల్లికార్జున, పులి సునీల్‌కుమార్‌లు

కడప సెవెన్‌రోడ్స్ : పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పులివెందుల జెడ్పీటీసీ అభ్యర్థిగా తుమ్మల హేమంత్‌రెడ్డి, ఒంటిమిట్ట జెడ్పీటీసీ అభ్యర్థిగా ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిలను ఆ పార్టీ ప్రకటించింది. ఈ మేరకు వారిరువురికి సంబంధించిన బి.ఫారాలను కార్పొరేటర్ మల్లికార్జున, సోషల్ వెల్ఫేర్ మాజీ చైర్మన్ పులి సునీల్‌కుమార్ సోమవారం ఎన్నికల అధికారి సి.ఓబులమ్మకు అందజేశారు.

జగదీష్‌ను ఆదర్శంగా తీసుకోవాలి : కలెక్టర్



వీఆర్‌ఓ జగదీష్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : బాక్సింగ్ విభాగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన నందలూరు గ్రామ వీఆర్‌ఓ జగదీష్‌ను జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సన్మానించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నమయ్య జిల్లా యువత జగదీష్‌ను ఆదర్శంగా తీసుకొని అన్ని రకాల క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా కృషి చేయాలన్నారు. వీఆర్‌ఓ జగదీష్‌కు శిక్షణ ఇచ్చిన కోచ్ ఆనంద్‌ను కూడా ఈ సందర్భంగా సన్మానించారు.మరికొంతమంది ఈ స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

మదనపల్లె, రాజంపేట సబ్ కలెక్టర్లు బదిలీ




నూతన సబ్‌కలెక్టర్లు కళ్యాణి, భావన

మదనపల్లి రూరల్ : మదనపల్లె, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, వైకోమ్ నదియా దేవిలను బదిలీ చేస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె విజయనంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరి స్థానంలో మదనపల్లె సబ్ కలెక్టర్‌గా 2023 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన చల్లా కళ్యాణి, రాజంపేట సబ్ కలెక్టర్ గా హెచ్.ఎస్ భావనను నియమించారు. అయితే బదిలీ అయిన సబ్ కలెక్టర్లు మేఘ స్వరూప్, వైకోం నదియా దేవిలకు పోస్టింగులకు సంబంధించి తదుపరి ఉత్తర్వుల్లో కేటాయిస్తామని పేర్కొన్నారు. గత ఏడాది జూలై నెలలో వీరు సబ్ కలెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించారు.

6 నుంచి దివ్యాంగులకు సహాయ పరికరాల పంపిణీ

మదనపల్లె సిటీ : జిల్లాలో దివ్యాంగుల కోసం ఈనెల 6 నుంచి 8వతేదీ వరకు దివ్యాంగులకు ఉచిత సహాయ పరికరాల పంపిణీ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వెలుగు సంస్థ కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలిమ్‌కో సంస్థ, దివ్యాంగుల సంక్షేమశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరాలు జరుగుతాయన్నారు.6న రాయచోటి, సంబేపల్లి, గాలివీడు, పెద్దమండ్యం, లక్కిరెడ్డిపల్లె, రామపురం, 7న మదపల్లె, రామసముద్రం, నిమ్మనపల్లె, కురబలకోట, పీటీఎం, బి.కొత్తకోట,తంబళ్లపల్లె, ములకలచెరువు, 8న వాల్మీకిపురం, గుర్రంకొండ, కలికిరి, కలకడ, పీలేరు, కె.వి.పల్లి మండలాల్లో శిబిరాలు జరుగుతాయన్నారు. ఈ శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులు మెడికల్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫోటో తీసుకురావాలని తెలిపారు.

రాజుకున్న వేడి

- పులివెందులలో జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారం ప్రారంభం
- అచ్చవెల్లిగంగమ్మ ఆలయంలో నేతల పూజలు
- ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తదితరులు



పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో భాగంగా ప్రచారంలో పాల్గొన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్‌రెడ్డి, పార్టీ నేతలు

సాక్షి ప్రతినిధి, కడప : పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారం అట్టహాసంగా ప్రారంభమైంది. సోమవారం అచ్చవెల్లి గంగమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అచ్చవెల్లి గ్రామంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, జెడ్పీ చైర్మన్ రామగోవిందురెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి తదితరులతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనతో, చంద్రబాబు పాలను బేరీజు వేసుకొని జెడ్పీటీసీ ఎన్నికల్లో ఓటు వేయాలని అభ్యర్థించారు. జెడ్పీటీసీ తుమ్మల మహేశ్వరరెడ్డి గంగమ్మ శిరిబండి తోలుతూ ప్రమాదవశాత్తు మృతిచెందితే ఆయన కుమారుడు హేమంత్‌రెడ్డిని పోటీలో నిలిపాం, ఆశీర్వాదించాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల నుంచి సానుకూలత లభిస్తుండడంతో మరింత ఉత్సాహంగా ప్రచారాన్ని కొనసాగించారు. పులివెందులను చీల్చలేరు, మన ఐక్యతను దెబ్బతీయలేరంటూ ప్రజల నుంచి ప్రతిస్పందన లభిస్తుండడం విశేషం.

జెడ్పీటీసీ ఎన్నికలు మంత్రులకు బాధ్యత

జెడ్పీటీసీ గెలుపుతో ఒరిగిపోయేదేమి లేకపోయినా టీడీపీ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, ఉమ్మడి జిల్లా మంత్రి రాంప్రసాదరెడ్డికి పులివెందుల జెడ్పీటీసీ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు సమాచారం. ఆమేరకు సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితా ఎన్నికల ప్రచారంలో పాల్గొంది. తుమ్మలపల్లె, ఎర్రిపల్లె గ్రామాల్లో ప్రచారం కొనసాగించింది. మంత్రి వెంట ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, పుత్తా చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఉన్నారు. మంత్రి వర్గ ఉపసంఘం సమావేశం నేపథ్యంలో మంత్రి రామప్రసాదరెడ్డి బుధవారం నుంచి ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. చిన్న జెడ్పీటీసీ ఎన్నిక ఏడాది కాల పరిమితి మాత్రమే ఉన్న ఎన్నిక కోసం టీడీపీ, బీజేపీ నేతల తాపత్రయం అంతా ఇంతగా లేదనే చెప్పాలి. పోలీసు అధికారులతో గ్రామస్థాయి నేతలపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ద్వారా రేషన్‌షాపు డీలర్లపై ఒత్తిడి పెంచుతున్నారు. గతంలో ఎన్నికల్లో పోలింగ్ ఏజెంట్లుగా కూర్చొన్న నేతల్ని పసిగట్టి మరీ ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. అధికారులు కొంతమంది పులివెందులలోనే తిష్టవేసి ఇలాంటి ప్రలోభవాలకు దిగుతుండడం పలువుర్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తోంది.

- కూటమి నేతల కుట్రలను వైఎస్సార్‌సీపీ బహిర్గతం చేస్తోంది. 48ఏళ్లుగా పార్టీ గుర్తుపై పోటీ చేసిన ప్రతి ఎన్నికల్లో విజయం సాధించిన వైఎస్ కుటుంబ చరిత్రలో ఇదో అతి స్వల్ప ఎన్నికలు. ఇక్కడి ప్రజలతో వైఎస్ కుటుంబానికి ఉన్న అనుబంధాలను మరెవ్వరూ తెంచలేని స్థితి. అలాంటి చోట అధికార పార్టీ శ్రేణులు, మంత్రులు, అధికారులు, వ్యవస్థలు తిష్టవేసి భయాందోళనకు గురిచేస్తున్న వైనాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు ఎండగట్టుతున్నారు. వైఎస్ కుటుంబానికి వీర విధేయులుగా ఉన్న వారిని కూడా ప్రలోభవాలకు గురి చేయడాన్ని ఉదాహరణలతో వివరిస్తున్నారు. ప్రజాభిమానమే ధన్నుగా, గత ఐదేళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనే పెట్టుబడిగా ఎన్నికల బరిలో వైఎస్సార్‌సీపీ దిగితే, అధికారం, వ్యవస్థలను నమ్ముకొని టీడీపీ బరిలో ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

పులివెందుల : పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన పులివెందుల మండలంలో జరిగే జెడ్పీటీసీ ఎన్నికకు సంబంధించి మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం జరిగిందని, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశానన్నారు. కార్యక్రమంలో పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్, సీఐలు ఉలసయ్య, వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

మోసాలు చేస్తున్న ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పండి

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు



కోనరాజుపల్లిలో అభ్యర్థితో కలిసి ప్రచారం చేస్తున్న ఎంపీ రఘునాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ఒంటిమిట్ట : 2024 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి మోసాలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పే అవకాశం వచ్చిందని, ఈ నెల 12న జరగబోయే ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, మీ సత్తా కూటమి ప్రభుత్వానికి చూపించాలని మండల ప్రజలతో రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే సుధా, కడప మేయర్ సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చింతరాజుపల్లి, కోనరాజుపల్లి పంచాయతీల్లోని గ్రామాల్లో అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ఉప ఎన్నిక ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాని ప్రజలను కోరారు. అనంతరం మేడా రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ..తప్పుడు హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను మోసం చేసిన ప్రభుత్వానికి ఈ ఎన్నికతో బుద్ధిచెప్పాలన్నారు.

- ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ..సూపర్ సిక్స్ అంటు అధికారంలోకి వచ్చిన సీఎం నారా చంద్రబాబు నాయుడు అహంకారాన్ని అణిచేవిధంగా ఎన్నిక ఫలితాలు తీసుకురావాలని అన్నారు.
- ఎమ్మెల్యే సుధా మాట్లాడుతూ..రాష్ట్రంలో 18 సంవత్సరాలు నిండిన మహిళలకు ఇస్తానన్న ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయలేమన్న టీడీపీ నేతలకు ఈ ఉప ఎన్నికల ఫలితాలు చెంప పెట్టుకావాలన్నారు.
- కడప మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ..ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగాలు రాక నిరుద్యోగులుగా ఉన్న వారికి నిరుద్యోగ భృతిని ఇస్తానని మోసం చేసిన ప్రభుత్వానికి ఈ ఉప ఎన్నిక ఫలితాలతో సిగ్గు రావాలన్నారు.
- మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా మాట్లాడుతూ..రైతులకు ప్రతి ఏటా కేంద్రం ఇస్తున్న రూ. 2 వేలతో కలిపి రూ. 20వేలు ఇస్తానని రైతన్నను నిలువులా ముంచేసిన ప్రభుత్వాన్ని ఓటు అనే ఆయుధంతో ఓడించాలన్నారు.
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ..ఫించన్లు పెంచినట్లే పెంచి వెనుకల గోతులు తీసినట్లు సుమారు 1లక్ష 50 వేల మంది పింఛన్‌దారులను అనర్హులుగా చేసిన సీఎం చంద్రబాబుపై ఈ ఉప ఎన్నిక సహాయంతో మీ తిరుగుబాటును చూపించాలన్నారు. - మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ..ఇది మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటూనే ఒక పక్క రెడ్ బుక్ పరిపాలన సాగిస్తుంది ఈ కూటమి ప్రభుత్వం. ఈ రెడ్ బుక్ పరిపాలనలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపే వారందరిపై అక్రమ కేసులు, హత్యా రాజకీయం, మహిళలపై అత్యాచారాలు, దాడులు చేస్తూ శాంతి భద్రతలు అనేటివి మంటగలుస్తున్నాయి. అలాంటి అధికార పార్టీ ని ఓడించి శాంతిభద్రతలను కాపాడాలని కోరారు.
- ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ..రాజంపేట నియోజకవర్గంలో అధికార పార్టీ రాజు లేని రాజ్యంగా తయారైందన్నారు. ఒంటిమిట్ట మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి మండల నాయకులు, కార్యకర్తల మధ్య సఖ్యత లేక వర్గ పోరుతో వారి ఉనికిని కాపాడుకునేందుకు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. అలాంటి వారిని మనం గెలిపించినా ఉపయోగం ఉండదన్నారు.
- రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ..ఒంటిమిట్ట వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిని గెలిపిస్తే మండలంలోని ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని, మండల అభివృద్ధి ముందుకు పోతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరి, ఒంటిమిట్ట మండల అధ్యక్షుడు టక్కోలు శివారెడ్డి, రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి, రాజంపేట నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడు కూండ్ల ఓబుల్ రెడ్డి, రాజంపేట బీసీ సెల్ అధ్యక్షుడు రాజ మోహన్‌నాయుడు, కోనరాజుపల్లి సర్పంచ్ శేఖర్ రెడ్డి, ఒంటిమిట్ట మండల పంచాయతీ రాజ్ అధ్యక్షుడు మేరువ శివనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల ప్రచార విభాగం అధ్యక్షుడు రాజశేఖర్‌రాయల్, జంగాల శివశంకర్ పాల్గొన్నారు.



చింతరాజుపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆకేపాటి, అంజద్‌బాషా, సురేష్ బాబు, రెడ్యం

సత్వరమే సమస్యల పరిష్కారం

జిల్లా కలెక్టర్ శ్రీధర్



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో అధికారులు బాధ్యతగా పనిచేసి వాటిని సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. కాబట్టి అధికారులు ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.

12న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

రాయచోటి జగదాంబసెంటర్ : వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన జాతీయ నులిపురుగల నిర్మూలన కార్యక్రమం నిర్వహించనున్నట్లు, పిల్లలు మరియు కిశోర బాలలకు (ఒక సంవత్సరం నుండి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు) ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్‌చామకూరి తెలిపారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించి గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లక్ష్మీనరసయ్య, వైద్య ఆరోగ్య సిబ్బంది శివప్రతాప్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

1321 టన్నుల యూరియా రాక

కడప అగ్రికల్చర్ : జిల్లాకు 1321 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ తెలిపారు. సోమవారం జేడీఏ కార్యాలయ టెక్నికల్ ఏవో గోవర్ధన్‌తో కలిసి జిల్లాకు రాక్‌లో వచ్చిన ఎరువులను ఆయన పరిశీలించారు. వైఎస్సార్ జిల్లాకు 942 మెట్రిక్ టన్నులను కేటాయించగా ఇందులో 426 మెట్రిక్ టన్నులను మార్క్‌ఫెడ్‌కు, మిగతా 516 మెట్రిక్ టన్నులను ప్రైవేటు డీలర్లకు కేటాయించారు. అలాగే అన్నమయ్య జిల్లాకు 380 టన్నులను కేటాయించారు. ఇందులో 235 టన్నులను మార్క్‌ఫెడ్‌కు, మిగతా 145 టన్నులను ప్రైవేటు డీలర్లు కేటాయించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ మాట్లాడుతూ డీలర్లు ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు అమ్మినట్లు తెలిసిన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పరీక్ష ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(ఏఎఫ్‌యూ)లో సోమవారం ఆర్కిటెక్చర్ విభాగానికి సంబంధించిన 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను ఢిల్లీ పర్యటనలో ఉన్న వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి. విశ్వనాథకుమార్ అంతర్జాల మాధ్యమం ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ అదనపు పరీక్షల నియంత్రణాధికారి జి.ఫణీంద్రరెడ్డి మాట్లాడుతు విద్యార్థుల సంక్షేమార్థం త్వరితగతిన పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు చెప్పారు.


పటిష్ట బందోబస్తు ఏర్పాటు : ఎస్పీ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్ కుమార్, పోలీసు అధికారులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సోమవారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 12వ తేదీన ఒంటిమిట్ట మండలంలో జరుగుతున్న జెడ్పీటీసీ ఎన్నికకు సంబంధించి మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించామన్నారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎస్ సుధాకర్, కడప టౌన్ డీఎస్పీ ఎ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఆర్ పురుషోత్తం రాజు, ఒంటిమిటట సిఐ టి బాబు, సిద్దవటం ఎస్ఐ ఎం మహమ్మద్ రఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే దోమల నివారణ



దోమల నివారణకు స్ప్రే చేస్తున్న కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి

రాయచోటి : పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణకు మార్గమని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రామచంద్రారెడ్డి అన్నారు. మలేరియా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం రాయచోటిలోని ఎస్ఎన్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎగువ అబ్బవరం సచివాలయం, రాయుడు కాలనీలో ఏసీఎం స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్, అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి మాట్లాడుతూ దోమల నివారణకు స్ప్రేయింగ్ అనేది ప్రతి ఇంటికి చేయించుకోవాలన్నారు. 2027 నాటికి మలేరియా రహిత జిల్లాగా మార్చాలని ఆయన వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆ దిశగా సిబ్బంది ప్రజలతో మమేకమై పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి నవీన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరామయ్య, సూపర్ వైజర్ నూర్జహాన్, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, రామచంద్ర, ఏఎన్ఎం రేష్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ సేవ




పల్లకీలో కొలువుదీరిన భద్రకాళీసమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడుకి భక్తులు భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ నిర్వహించారు. సోమవారం రాత్రి ఆలయంలోని మూల విరాట్‌లకు అభిషేకాలు, పూజలు జరిపారు. అనంతరం ఉత్సవ మూర్తుల అందంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయ మాఢవీధిలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డివి రమణారెడ్డి, ప్రధాన అర్చకులు శంకరయ్యస్వామి, కృష్ణయ్యస్వామి,శేఖర్ స్వామి, రాచరాయ యోగి, భక్తులు పాల్గొన్నారు.

ప్రతిభకు పరీక్ష

- 6 నుంచి ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు అవకాశం
- విద్యార్థి విజ్ఞాన్ మంథన్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు తుది గడువు సెప్టెంబర్ 30



వీవీఎం బ్రోచర్

మదనపల్లె సిటీ : విద్యార్థులు పరిశోధన, ప్రయోగాల్లో రాణించేలా ఏటా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పేరుతో జాతీయ స్థాయిలో ప్రతిభాన్వేషణ్ పరీక్ష నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్‌టీ, విజ్ఞాన్ ప్రసాద్,విజ్ఞాన భారతి సంయుక్తంగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నా. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు భారతదేశ ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉంటుంది.

ఈ పరీక్షకు 2025–26 విద్యా సంవత్సరానికి దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సెప్టెంబర్ 30లోపు దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేసుకోండిలా...

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్ష రాసేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు రూ.200 చెల్లించి వీవీఎం అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. పరీక్ష జరిగే రోజు విద్యార్థులు వారికి అందుబాటులో ఉన్న మొబైల్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, డిజిటల్ పరికరాలలో ఏదైనా ఒక దాని ద్వారా నిర్దేశించిన అప్లికేషన్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇంటి నుంచే పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది. పుస్తకాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

పోటీ పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6 నుంచి 8 తరగతులకు జూనియర్, 9 నుంచి 11 తరగతులకు సీనియర్ గ్రూపుగా విభజిస్తారు. ఇందులో తెలుగు, హిందీ, ఆంగ్లం తదితర ప్రాంతీయ భాషల్లో పరీక్ష ఉంటుంది. విద్యార్థులు తమ ఆసక్తిని బట్టి నచ్చిన భాషలో పరీక్ష రాయవచ్చు. పాఠశాల స్థాయి ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభ మొదటి 20 మందిని ఎంపిక చేస్తారు. 6 నుంచి 11 తరగతులకు మొత్తం 120 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. ఇందులో ప్రతిభ చూపిన ప్రతి తరగతి నుంచి ముగ్గురు వంతున మొత్తం 18 మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు.

వంద మార్కులకు పరీక్ష

నమూనా పరీక్ష అక్టోబర్ 28 నుంచి 30 తేదీల వరకు నిర్వహిస్తారు. ప్రధాన పరీక్ష నవంబర్ 19న అబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. జూనియర్, సీనియర్ రెండు విభాగాల్లో ప్రశ్నకు ఒక్కో మార్కు చొప్పున 100 మార్కులుంటాయి. సెక్షన్-ఎలో విజ్ఞానశాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషి 20, శాంతి స్వరూప్ భట్నాగర్ జీవిత చరిత్ర నుంచి 20 ప్రశ్నలు, సెక్షన్-బిలో జూనియర్ ,సీనియర్ విద్యార్థులకు గణితం, ఫిజిక్స్,కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల నుంచి 50, లాజికల్ థింకిం గ్, రీజనింగ్ నుంచి 10 ప్రశ్నలుంటాయి.

నగదు ప్రోత్సాహకాలు:

జాతీయస్థాయిలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతిగా వరుసగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తారు. జాతీయ, జోనల్ స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్‌డీఓ, ఇస్రో, సీఎస్ఐఆర్, బీఏఆర్‌సీ వంటి ప్రఖ్యా త జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో ఒకటి నుంచి మూడు వారాల పాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక చేస్తారు.

క్లుప్తంగా

పోలీసుల అదుపులో నిందితుడు



పోలీసుల అదుపులో నిందితుడు చంద్ర రమేష్

నందలూరు : నందలూరు పోలీసు స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 15/2022 కేసులో ఏ4 నిందితుడిగా ఉన్న తిరుపతి పట్టణం కరకంబేడు వీధికి చెందిన చంద్ర రమేష్ అనే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతను స్టోర్ బియ్యం విక్రయం కేసులో నిందితుడిగా ఉండి, కోర్టు వాయిదాలకు హాజరుకానందున కోర్టు అతనిపై నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. నిందితుడిని సోమవారం నందలూరు కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించిందన్నారు.

ఆటో ఢీకొని వృద్ధురాలి మృతి



మృతి చెందిన వృద్ధురాలు మంగమ్మ

కలికిరి : ఆటో ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన సోమవారం కలికిరి పట్టణ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... కేవీ పల్లి మండలం నూతనకాల్వ గ్రామం దిండువారిపల్లికి చెందిన చింతపర్తి మంగమ్మ(82) కలికిరిలోని తన బంధువుల ఇంటికి వచ్చింది. సోమవారం ఉదయం పోలీస్ స్టేషన్ సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా కలికిరి పట్టణానికి చెందిన సుబహాన్ ఆటోతో ఢీకొన్నాడు. ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మంగమ్మ కుమార్తె రామ కుమారి ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవరు సుబహాన్‌పై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ మదన్‌మోహన్ రెడ్డి తెలిపారు.

మున్సిపల్ ఉద్యోగిపై దాడి



దాడిలో గాయపడిన ఫిట్టర్ సుధాకర్

మదనపల్లె రూరల్ : మున్సిపల్ ఉద్యోగిపై దాడి చేసిన ఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. రామారావుకాలనీకి చెందిన సుధాకర్ మున్సిపాలిటీలో ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధుసూదన థియేటర్ సమీపంలోని ఎస్‌కే.ఆయిల్ స్టోర్స్ వెనుకవైపున ఉన్న ఇంటిలో ఉండగా, కుటుంబ వివాదంలో భాగంగా గాంధీపురానికి చెందిన రాజా, రవి, ప్రదీప్ అనుచరులతో వచ్చి సుధాకర్‌పై దాడికి పాల్పడ్డారు. దాడిలో సుధాకర్ తీవ్రంగా గాయపడగా గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట రూరల్: జవహర్ నవోదయ విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం సైన్స్ విభాగంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ గంగాధరన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024–2025లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తులను జేఎన్‌వీవైఎస్‌ఆర్‌డీఐఎస్‌టీఆర్‌ఐసీటీ జీ మెయిల్.కాం చిరునామాకు మెయిల్ చేయాలని కోరారు.

తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

- పీలేరు మాజీ సర్పంచ్ హుమయూన్, ఆయన సోదరుడు మృతి
- కుమారుడి పరిస్థితి విషమం
- పీలేరులో అలుముకున్న విషాద ఛాయలు



హుమయూన్ (ఫైల్)



షాజహాన్ (ఫైల్)



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

పీలేరురూరల్ : తమిళనాడు రాష్ట్రం తిరుత్తణి సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పీలేరు మాజీ సర్పంచ్ ఎ.ఎస్. హుమయూన్ (65), ఆయన సోదరుడు షాజహాన్ (55) మృతి చెందగా, ఆయన కుమారుడు, వార్డు మెంబరు హబీబ్‌బాషా పరిస్థితి విషమంగా ఉంది. వివరాలిలా ఉన్నాయి. పీలేరు పట్టణం తిలక్ వీధికి చెందిన మాజీ సర్పంచ్ ఎ.ఎస్. హుమయూన్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చెన్నైలో చికిత్స పొందడానికి సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు ఇంటి నుంచి కారులో బయలుదేరారు. అయితే ఉదయం 6.30 గంటల సమయంలో తిరుత్తణి వద్ద ఆగి ఉన్న లారీని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో హుమయూన్, ఆయన సోదరుడు షాజహాన్ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హబీబ్‌బాషాను స్థానికుల సాయంతో తిరుత్తణి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం చెన్నై అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతని పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంలో మృతి చెందిన హుమయూన్ రెండు పర్యాయాలు పీలేరు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పని చేశారు. ఆయన మృతి పట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఫోన్ ద్వారా హుమయూన్ సోదరులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

మృత్యువులోనూ వీడని బంధం..

మాజీ సర్పంచ్ హుమయూన్‌కు తోడు నీడగా ఉంటున్న సోదరుడు షాజహాన్ మృత్యువు లోనూ వీడని బంధంగా మృతి చెందడంతో పలువురిని కలచివేసింది. ఒకే కుటుంబంలో అన్నాదమ్ములు ఇద్దరు మృతి చెందడం, మరొకరి పరిస్థితి విషమంగా ఉండడంతో పీలేరులో విషాద ఛాయలు అలుముకున్నాయి. వారి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.



చికిత్స పొందుతున్న హబీబ్‌బాషా

శిల్పారామం తరహాలో టెర్రకోటకు అంగళ్లులో క్రాఫ్ట్ విలేజ్

రాష్ట్ర హస్తకళల నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరి ప్రసాద్



అంగళ్లు టెర్రకోట హస్తకళాకారుల సభలో మాట్లాడుతున్న పసుపులేటి హరిప్రసాద్

కురబలకోట : తిరుపతి శిల్పారామం తరహాలో టెర్రకోట హస్త కళాకారుల సంక్షేమం కోసం కురబలకోట మండలంలోని అంగళ్లు బైపాస్ పక్కన క్రాఫ్ట్ విలేజ్‌ను ఏర్పాటు చేయిస్తామని రాష్ట్ర హస్తకళల నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ హామీ ఇచ్చారు. సోమవారం ఆయన అంగళ్లులోని టెర్రకోట సీఎఫ్‌సీ సెంటర్‌ను సందర్శించారు. అనంతరం అక్కడ జరిగిన సభలో ముఖ్య అతిథిగా మాట్లాడుతూ హస్తకళలను ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఆర్థిక వనరులను తీసుకు రావడంతో పాటు టెక్నాలజీని తీసుకు వస్తామన్నారు. ఈ కళకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకు వస్తామన్నారు. ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్‌చే వీటికి ప్రమోషన్ కూడా చేయించి డిమాండ్ సృష్టించి తగిన ఆదాయ వనరులు పొందేలా చూస్తామన్నారు. పీ–4 పథకంలో హస్త కళలను చేర్పామన్నారు. టెర్రకోట కళాకారులకు బంకమట్టి, మిషనరీ సౌకర్యం కల్పిస్తామన్నారు. శాలివాహన చైర్మన్ ఈశ్వర్, నియోజక వర్గ టీడీపీ నాయకులు డి. జయచంద్రారెడ్డి, పి. సాయినాథ్, సీఈఓ కృష్ణమూర్తి, టెర్రకోట సంఘ నాయకులు దుర్గం మల్లికార్జున, కంటేవారిపల్లె బాలాజీ, శ్రీనివాసులు, సురేంద్ర, పద్మావతమ్మ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

14లోపు రైతులు పంటల బీమాకు దరఖాస్తు చేసుకోవాలి



బొగ్గిడివారిపల్లెలో పసుపు పంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి

సిద్దవటం : పసుపు, ఉల్లి పంటలకు సంబంధించి బీమా వర్తింపు కోస ఈనెల 14లోపు రైతులు పంట బీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. సిద్దవటం మండలంలోని బొగ్గిడివారిపల్లె గ్రామంలో సోమవారం పసుపు పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట బీమా కోసం ఈ- పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ప్రధాన మంత్రి పసల్ బీమా యోజన కింద పసుపు, ఉల్లి పంటల బీమా కోసం ప్రీమియం చెల్లించేందుకు ఈనెల 14 వరకు ప్రభుత్వం గడువు పొడిగించిందన్నారు. పసుపు పంటకు ఎకరాకు రూ. 180, ఉల్లి పంటకు ఎకరాకు రూ.90 చెల్లించాలన్నారు. పుసుపు పంటకు బీమా మొత్తం హెక్టారుకు రూ. 2, 25000, ఉల్లికి బీమా మొత్తం హెక్టారుకు రూ. 1,12,500 వర్తిస్తుందని తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కొరియర్ వాహనం బోల్తా



విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వంకలో పడిన కొరియర్ పార్సిల్ వాహనం

సిద్దవటం : మండలంలోని సిద్దవటం గ్రామ సమీపంలో అన్నపూర్ణ భిక్షేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం కొరియర్ పార్సిల్ వాహనం రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వాహనం వంకలో బోల్తా పడింది. కడప నుంచి బద్వేలుకు సోమవారం కొరియర్ పార్సిల్‌ను తీసుకు వెళుతున్న వాహనం నేకనాపురం రహదారి దాటుకొని శ్రీ అన్నపూర్ణ భిక్షేశ్వర స్వామి ఆలయం వద్దకు రాగానే విద్యుత్ స్తంభాన్ని వాహనం ఢీకొనడంతో స్తంభం విరిగి పోయింది, వాహనం వంకలో బోల్తాపడింది. దీంతో సిద్దవటంలో 4 గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం కలిగింది. వాహనంలో ఉన్న కిషోర్, చాంద్‌బాషా అనే ఇద్దరు వ్యక్తులకు గాయాలు కావడంతో 108 వాహనంలో వారిని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. జరిగిన ఘటనపై సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



బోనంశెట్టి రవీంద్ర(ఫైల్)

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రామాపురం మండలం కసిరెడ్డిగారిపల్లి పంచాయతీ దళితవాడకు సమీపంలో ఈ నెల 3వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆగి ఉన్న కారును బైకు ఢీకొన్న ఘటనలో బోనంశెట్టి రవీంద్రకు తీవ్ర గాయాలైన విషయం విదితమే. ఆయన కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు రామాపురం పోలీసులు తెలిపారు. మృతుడు రామాపురం మండలం సరస్వతిపల్లి గ్రామానికి చెందినవాడు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌కు గురైన బెంగాల్ వాసి మృతి



మృతి చెందిన బెంగాల్‌వాసి సునేరామ్

నిమ్మనపల్లె : విద్యుత్ షాక్‌కు గురైన పశ్చిమబెంగాల్ వాసి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. జూలై 30న మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ బాలేవాండ్లపల్లె వద్ద విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆర్డీఎస్ఎస్ విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ పోల్ ఎక్కి పనులు చేస్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన సునేరామ్(30) విద్యుత్ సరఫరా కావడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

రాయచోటి జగదాంబసెంటర్ : ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కేజీబీవీ గురుకుల హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని స్పందన కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణకు వినతిపత్రం అందజేసినట్లు ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లాలో చాలా హాస్టళ్లకు విద్యార్థులకు సరిపడా గదులు, మరుగుదొడ్లు, స్నానపు గదులు లేవన్నారు. మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ ఏరియా కార్యదర్శి కార్తీక్ నాయక్, నారాయణ పాల్గొన్నారు.

తరగతి గదిలో జారిపడిన బాలుడు



గాయపడిన బాలుడు మల్లికార్జున

పెద్దతిప్పసముద్రం : మండలంలోని బూర్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఆరవ తరగతి చదివే ఆవుల మల్లికార్జున అనే బాలుడు సోమవారం స్కూల్ ఆవరణంలో ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు బాలుడిని చికిత్స నిమిత్తం ద్విచక్ర వాహనంలో బి.కొత్తకోట సీహెచ్‌సీకి తరలించారు. ఎడమ చేయి విరిగిందని డాక్టర్లు నిర్ధారించడంతో బాలుడిని 108 పైలెట్ రాజు, ఈఎంటీసాంబశివలు మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే బాలుడి వెంట ఏ ఒక్క ఉపాధ్యాయుడు కూడా వెళ్లకపోవడం గమనార్హం.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న మాజీ సర్పంచులు



ట్రాక్టర్లను అడ్డుకుంటున్న మాజీ సర్పంచులు

వీరబల్లి : మండలంలోని మట్లి పంచాయతీలో కోదండరామ స్వామి దేవాలయం వద్ద మాండవ్య నది నుంచి సోమవారం కొందరు వ్యక్తులు ట్రాక్టర్లతో ఇసుకను తీసుకెళ్లేందుకు వచ్చారు. విషయం గమనించిన తాటికుంటపల్లి పంచాయతీ మాజీ సర్పంచులు లక్ష్మయ్య, తిమ్మారెడ్డి, తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు నందా కలిసి ఇసుకను తీసుకెళ్లకుండా అడ్డుకున్నారు. లోడు చేసుకున్న ఇసుకను అక్కడే దింపివేసి వెళ్లాలన్నారు. ఇసుకను ఇక్కడి నుంచి వేరే ప్రాంతాలకు తీసుకువెళితే ఒప్పుకునేది లేదని తేల్చి చెప్పారు. దీంతో ట్రాక్టర్లు తిరిగి వెళ్లిపోయాయి.

కేబుల్ వైర్ల చోరీ ముఠా ఆట కట్టించాలి

రాయచోటి జగదాంబసెంటర్ : కేబుల్ వైర్ల చోరీ ముఠా ఆట కట్టించి అన్నదాతలను ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఎండపల్లి బాలకృష్ణారెడ్డి జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఆయన ఎస్పీ కార్యాలయం వద్ద మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో రైతులు నీటి ఎద్దడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో పంపుసెట్లకు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ వైర్లను కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించుకొని వెళ్తున్నారన్నారు.

షిఫ్ట్ ఆపరేటర్‌పై దాడి

మైదుకూరు : మండలంలోని ఆదిరెడ్డిపల్లె విద్యుత్ సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న బండి సురేష్‌పై దాడి జరిగిన విషయంపై మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వనిపెంట సెక్షన్‌లోని ఆదిరెడ్డిపల్లె సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తుండగా శనివారం తిప్పిరెడ్డిపల్లె కొత్తపల్లెకు చెందిన మాదం నాగేశ్వరరావు వెళ్లి కరెంట్ ఇంకా ఎందుకు వదల్లేదని దాడి చేశాడు.

దేవుడా.. ఎంత పని చేశావయ్యా!

బరువెక్కిన గుండెతో మృతుల అంత్యక్రియలు



మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ములకలచెరువు: అయ్యో దేవుడా మా మీద దయ లేదా.. ఎంత పని చేశావయ్యా.. మూడు కుటుంబాల్లో ఒక్కొక్కరు మాత్రమే ఉన్నారు.. వారూ తనువు చాలించారు.. మాకెందుకయ్యా ఇంత వేదన ఇచ్చావంటూ మృతుల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతూ విలపించిన దృశ్యం చూపరుల హృదయాలను కలచి వేసింది.

మండలంలోని పెద్దపాళ్యం ఫ్లై ఓవర్ వద్ద ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో వేపూరికోట పంచాయతీ కుటాగోళ్లపల్లెకు చెందిన ముగ్గురు యువకులు మృతి చెందిన సంఘటన పాఠకులకు తెలిసిందే. కె.చంద్రప్ప కుమారుడు కె.వెంకటేష్ (26), కె.వేమనారాయణ కుమారుడు తరుణ్ (21), కె.ఓబులేసు కుమారుడు కె.మనోజ్ (20)లు ములకలచెరువుకు వెళ్తుండగా ప్రమాదంలో మృతి చెందారు. సోమవారం మృతదేహాలను పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందించారు. వీరి అంత్యక్రియలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చారు. కుటుంబ సభ్యుల రోదన చూపరులకు కంట తడిపెట్టించింది. ఉద్యోగాలు చేసుకుంటూ బెంగళూరులో ఉంటున్న ముగ్గురు ఒక్కసారిగా మృతి చెందడంతో కుటాగోళ్లపల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బరువెక్కిన గుండెలతో మృతులకు అంత్యక్రియలు నిర్వహించారు. అదేవిధంగా బురకాయలకోట పంచాయతీ ఎరమాసివారిపల్లెకు చెందిన శ్రీనివాసులు (45) గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. ములకలచెరువు పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నల్ల తుమ్మచెట్ల అక్రమార్కులపై చర్యలకు జేసీ ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..



తుమ్మచెట్లు తొలగించిన కుంటలో పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ నాగరాజ

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురం మండల పరిధిలోని మంచూరు గ్రామ పంచాయతీలో వున్న తిమ్మిరెడ్డికుంట, కొత్తకుంటలో ఎలాంటి అనుమతులు లేకుండా నల్ల తుమ్మ చెట్లను ఆ గ్రామ పంచాయతీ సర్పంచ్ కె.జ్యోతి భర్త పి.సురేష్ విక్రయించి సొమ్ము చేసుకోవడంపై సోమవారం సాక్షిలో 'నల్ల తుమ్మ చెట్లు అక్రమ రవాణా' కథనం ప్రచురితమైంది. అలాగే మంచూరు గ్రామస్తులు శంకర్‌రెడ్డి తదితరులు సాక్షిలో ప్రచురితమైన కథనంతో సోమవారం పీజీఆర్ఎస్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన జేసీ ఆదర్శ రాజేంద్రన్ నల్లతుమ్మ చెట్లు అక్రమ రవాణాపై సమగ్ర విచారణ జరిపి అక్రమదారులపై కేసు నమోదు చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. ఈ మేరకు డీపీఓ ఆదేశాల మేరకు మదనపల్లి డీఎల్‌పీఓ నాగరాజ సోమవారం సాయంత్రం మంచూరు పంచాయతీ పరిధిలోని తిమ్మిరెడ్డికుంట, కొత్తకుంటలను పరిశీలించారు. రెండు కుంటలలో కలిపి సుమారు 60 చెట్లకు పైగా కోసినట్లు గుర్తించామన్నారు. పంచాయతీరాజ్ శాఖ నుంచి తుమ్మచెట్ల వేలానికి గానీ, తరలింపునకు గానీ, కటింగ్‌కు గానీ ఎలాంటి అనుమతులు లేవని, అటవీశాఖ నుంచి మాత్రం కటింగ్ ఆర్డర్ ఉన్నట్లు తమ విచారణలో తేలిందని డీఎల్‌పీఓ వివరించారు. అలాగే గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించామన్నారు. గ్రామస్తుల వివరాలు, పంచాయతీ కార్యదర్శి వివరణ అనంతరం, విచారణ నివేదికను డీపీఓకు పంపనున్నట్లు డీఎల్‌పీఓ పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి సుమతి, మంచూరు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ డీఎల్‌పీఓ వెంట పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందించండి

పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ



ప్రజల సమస్యలను వింటున్న జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోపు సత్వరం పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఎస్పీ అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ముఖాముఖిగా అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై సత్వరం స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. లక్కిరెడ్డిపల్లి మండలం అనంతపురం వడ్డిపల్లి గ్రామానికి చెందిన బత్తల సుబ్బమ్మ (70) తన సమస్యను చెప్పుకునేందుకు ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. ఎస్పీ ఆమె వద్దకే వెళ్లి సమస్య విన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి చట్టపరిధిలో వృద్ధురాలి సమస్యను పరిష్కరించాలని లక్కిరెడ్డిపల్లి ఎస్ఐను ఆదేశించారు.

రూపానంద రెడ్డి అండతో ప్రభుత్వ భూమి కబ్జా



మాట్లాడుతున్న ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి

పుల్లంపేట : కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పుల్లంపేట మండలం అనంతసముద్రం, కొమ్మనవారిపల్లి గ్రామాలలో టీడీపీ ఇన్‌చార్జి రూపానందరెడ్డి అండతో ప్రభుత్వ భూములు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నాయని పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అనంత సముద్రం గ్రామానికి చెందిన ముద్దా సుబ్బారెడ్డి ఆయన కుమారుడు ముద్దా సుభాష్‌లు 40 ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమించారని తెలిపారు. అనంత సముద్రంలో సర్వే నెంబరు. 326, 330/3, 331, 339/1, 1194/2లో ఉండే ప్రభుత్వ భూములే కాకుండా గ్రామ కంఠం సర్వే నెంబర్లకు సంబంధించి 327/2, 328, 329, 321/1లో ప్రభుత్వ భూమి ఐదు ఎకరాలు ఆక్రమించుకున్నారన్నారు. అలాగే కేతు సుబ్బరామిరెడ్డి, కేతు రజనీకాంత్ రెడ్డిలు 13 ఎకరాల భూమిని సర్వే నెంబరు. 1089/1, 128/1, 129/1లలో ఆక్రమించుకున్నారన్నారు. అనంతసముద్రం ఎంపీటీసీ కుమారుని భూమిని సైతం ఆక్రమించారని తెలిపారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి





దాడిలో గాయపడిన చింతకాయల నరసింహులు, చింతకాయల శేషాద్రి

నందలూరు : మండలంలోని చింతకాయపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు రేషన్‌షాపు మార్పిడి విషయమై ఘర్షణ పడ్డారు. ప్రభుత్వం మాది మేము చెప్పినట్లే వినాలంటూ టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతకాయల ఎల్లయ్యపై దాడి చేశారు. దాడిని అడ్డుకోబోయిన చింతకాయల నరసింహులుపై కత్తితో దాడి చేయగా తలకు తీవ్ర గాయమైంది. చింతకాయల శేషాద్రిపై రాడ్‌తో దాడి చేయడంతో భుజానికి తీవ్రంగా గాయమైంది. క్షతగాత్రుడిని హుటాహుటిన రాజంపేట ప్రభుత్వాసుపత్రికి బంధువులు తరలించారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేసిన చుక్కా నీలేష్, చుక్కా కొండయ్య, చుక్కా చంద్ర, చుక్కా శశిధర్, చుక్కా మణెమ్మ, చుక్కా వెంకటేష్, చుక్కా చంద్రలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

అది అన్నదాత దుఃఖీభవ పథకం



జేసీకి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నేతలు

రాయచోటి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులకు అందించింది అన్నదాత సుఖీభవ కాదని, అన్నదాత దుఃఖీభవ పథకమని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు వై.ఆరంరెడ్డి, రాష్ట్ర బూత్ వింగ్ జనరల్ సెక్రటరీ రహిమాన్ ఖాన్‌లు దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విభాగం పిలుపు మేరకు సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జిల్లా రైతు సంఘం నాయకులు, సభ్యులు, రైతులు కూటమి ప్రభుత్వ నిరంకుశత్వ పోకడలపై విమర్శలు గుప్పించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నవరత్నాల పేరిట ప్రవేశపెట్టిన వైఎస్సార్ రైతు భరోసా పథకానికి కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో అన్నదాత సుఖీభవ అని నమ్మించి రైతులను నట్టేట ముంచిందన్నారు. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ. 2 వేలు జమ చేశారే తప్ప రాష్ట్ర ప్రభుత్వం నుంచి చిల్లిగవ్వ విడుదల చేయలేదన్నారు. పీఎం కిసాన్ కూడా కొంత మంది రైతులకు మాత్రమే వేసి మిగిలిన రైతులకు మొండి చేయి చూపారన్నారు. రైతులంటే చంద్రబాబుకు మొదటి నుంచి చిన్నచూపే అని ఆరోపించారు. గతంలో మహానేత వైఎస్సార్ ఉచిత విద్యుత్ ప్రకటిస్తే విద్యుత్ తీగలపై రైతులు బట్టలు ఆరేసుకోవాలని చంద్రబాబు ఎద్దేవా చేశారన్నారు. చంద్రబాబు అధికారంలో ఉంటే కరువు విలయతాండవం చేస్తుందన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 57 లక్షల మంది రైతులకు రైతు భరోసా ద్వారా సంక్షేమం అందిస్తే కూటమి ప్రభుత్వంలో 12 లక్షల మంది రైతులకు పీఎం కిసాన్ అందకుండా చేశారంటూ మండిపడ్డారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.